# పుట్టగొడుగులు

సనగరం పార్థసారథి




వరుణదేవుడు కరుణించాడు.

ఇంటికెదురుగా నున్న రావిచెట్టు కొమ్మ మీద కాకి గూడుంది. కాకి టప, టప రెక్కలల్లార్చి [illegible] ఆకులమీద దూసుకుంటూ ఎగిరి పోయింది.

ఇంటి వరండాలో సీతారామయ్య పడక కుర్చీలో కుర్చొన్నాడు. చలిగాలికి వెచ్చగా శాలువ కప్పుకున్నాడు.

గూడు నుండి ఎగిరి పోతున్న కాకిని కళ్ళార్పకుండా చూశాడు సీతారామయ్య.

వారం రోజులుగా విడవకుండా పడుతున్న వర్షం ఆగిపోయింది.

సీతారామయ్యకు కూడా కాకిలా ఒక్కసారి రెక్కలల్లార్చుకోవాలని పించింది. పడక కుర్చీ నుండి లేచి ఒళ్ళు విదిలించుకొని "రామా! పరంధామా" అనుకుంటూ రెండు అరచేతులు రుద్దుకొని వెచ్చగా ముఖం తుడుచు కున్నాడు.

సూర్యుడు కూడ దయతలచినట్టున్నాడు. వారం రోజుల తరువాత నిద్ర మేల్కొన్నా చురుగ్గానే వున్నాడు.

సీతారామయ్య వరండా ముందు భాగంలో ఎప్పుడో వేసిన జకట్టే, రెండు పూల మొక్కలు కళకళలాడుతూ కనిపించాయి. మెల్లగా వీస్తున్న గాలికి తల లూపుకుంటూ ఒకటితో నొకటి నాటి భాషలో మాట్లాడు కొంటున్నట్టు అగుపించాయి.

సీతారామయ్య దృష్టి పూల మొక్కల మీద నుండి వీధివైపు మరలింది.

వారం రోజులుగా నిర్మానుష్యంగా వున్న వీధి జన సందోహంగా వుంది. వీధి నిండుగా వుంది. ప్రజలు జాగ్రత్తగా చూచుకుంటూ వెళ్తున్నట్టు కనిపించారు సీతారామయ్యకు. వెంటనే ఎందుకో నవ్వు వచ్చిం దతనికి.

ఆ వీధినే వెళ్తున్న విద్యార్థుల గుంపు కంట బడింది. వారిని చూడగానే తన కనిష్ట కుమారుడు సూర్యనారాయణ జ్ఞప్తి కొచ్చాడు. ప్రొద్దుననగా కాఫీ త్రాగి వెళ్ళినవాడు యింకా యింటికిరాలేదు. ఎక్కడ తిరుగుతున్నాడో ఏమో? — అతని మనస్సు ఆలోచిస్తోంది.

ఆ రోజు జూలై నెల మొదటివారంలో ఒక రోజు. సీతారామయ్య వుపాధ్యాయ వృత్తిలో నున్న రోజుల్లో యీ వారాన్నే 'స్టూడెంట్స్ వీక్' అనేవాడు తోటి సహోధ్యాయులతో.

స్కూళ్ళు తెరిచారు. కాలేజీ కూడ తెరిచారు.

వరండాలో చలిగాలికి ఎక్కువసేపు నిలబడలేక లోపలికి వెళ్ళి పడక కుర్చీలో పడుకున్నాడు శాలువ కప్పుకొని.

కుమారుని రాకకై నిరీక్షిస్తుంటే అతని మనస్సు గతంవైపు దారి తీసింది.

సీతారామయ్య ఉపాధ్యాయ వృత్తి నుండి విరమించి రెండేళ్ళు దాటుతోంది. అతనికి ముగ్గురు కొడుకులు, ఒక్క కూతురు. సూర్యనారాయణ కడపటివాడు. నారాయణకు అయిదో ఏడు వచ్చేసరికి సీతారామయ్యకు భార్యా వియోగం కలి

గింది. ఆనాటి నుండి నేటివరకు తానే తల్లిగా మారి, తండ్రిగా తన ధర్మాన్ని నిర్వర్తిస్తూనే, పెంచి పెద్ద చేశాడు తన బిడ్డల్ని.

సీతారామయ్య అంటే యీ రోజుకు ఆ వూరిలో గౌరవం వుంది. ఆపేక్ష వుంది. అతని భార్య బ్రతికివున్న రోజుల్లో తన శక్తి మేరకు కొందరు విద్యార్థులకు వుచితంగా భోజనం పెట్టి విద్య చెప్పాడు. కొందరికి ఫీజు తీసుకోకుండానే ట్యూషన్ చెప్పాడు. అతని వలన బాగుపడిన వారెందరో వున్నారు. అతని వద్ద చదువుకున్నవారు పెద్ద వుద్యోగాల్లో కూడా వున్నారు. వారు ఎప్పుడయినా కనుపించి, తమను తామే ఎరుకపరచుకొని కృతజ్ఞతా భావం వెలిబుచ్చి పోతుండేవారు. సీతారామయ్యకు ఆ రోజు పరమానందం. ఉపాధ్యాయునికి అంతకన్న కోరదగినదేమీ లేదని అనుకొనేవాడు.

పెద్ద కొడుకు శేఖరం ఎం. ఏ. పాసయి బొంబాయిలో ఏదో ప్రయివేటు కంపెనీలో పని జేస్తున్నాడు. బాగా సంపాదిస్తున్నాడు. అతనికి రెండేళ్ల క్రితమే వివాహమయింది. భార్యతో పాటు అక్కడే వుంటున్నాడు.

రెండవ కొడుకు శ్రీధరం. బి. ఇ. పాసయ్యి హైదరాబాదులో పని జేస్తున్నాడు.

సీతారామయ్యకున్న ఆస్తి పెద్దకొడుకులిద్దరి చదువుతో హరించి పోయింది.

కూతురి పెళ్లికి వూరిలోని ధనికులందరు సహాయం చేశారు. అనుకోకుండానే పెద్ద సంబంధం కుదరడం, సహాయం అందడం సీతారామయ్యకు ధైర్యం, ఆశ్చర్యము, ఆనందం ఒక్కసారిగా కలిగాయి. కూతురి పెళ్లి మహా వైభవంగా జరిపించాడు. అతనికి ఒక్కటే బాధ. ఇన్ని సంతోషాలకు కారణమయిన యిల్లాలు లేని లోపమే! కాని తనబాధను ఎక్కడా వ్యక్తం చెయలేదు. కూతుర్ని సలక్షణంగా, సగౌరవంగా అత్తగారింటికి పంపాడు.

సూర్యనారాయణ బయోలాజి గ్రూపుతో పి. యు. సి. మొదటి శ్రేణిలో పాసు అయ్యాడు.

ఇద్దరు కొడుకులు రెండు చేతులా ఆర్జిస్తున్నా, సీతారామయ్యకు యిరవై రూపాయల పెన్షన్‌మీద ఆధారపడటం కన్న గత్యంతరం లేకపోయింది. తండ్రి, కర్తవ్యాన్ని నిర్వర్తించాననే తృప్తి మాత్రం మిగిలిందతనికి.

* * *

రెండు రోజులు చెలి వాతావరణంలో గడిచి పోయాయి.

ఉదయం పది గంటలయింది.

సూర్యనారాయణ వంట చేస్తున్నాడు. వంట చేయడం అతనికేమీ క్రొత్త విద్య కాదు. సూర్యనారాయణ అన్ని పరిస్థితులకు అనుకూల వ్యక్తిగా పెరిగాడు. ఆ నేర్పు సీతారామయ్య తీర్పులోనే వుంది.

వరండాలో పడక కుర్చీలో పడుకొని ఆలోచనలో మునిగిపోయి వున్నాడు సీతారామయ్య.

ఇంటిముందున్న కాంపౌండు గోడ అక్కడక్కడ పడిపోను నాను మాత్రంగా, యింటి కాపుగా నిలబడివుంది. ఇటీవలి వర్షానికి గోడమీద ఒకచోట గుంపుగా కుక్కగొడుగులు (పుట్టగొడుగులు) లేచాయి.

చిన్నకొడుకు భవిష్యత్తును గురించి ఆలోచిస్తున్న అతని దృష్టి, ఎక్కడెక్కడో పయనించి గోడమీద వున్న కుక్కగొడుగుల మీద పడింది. ఉన్నట్టుండి లేచి గోడవద్దకు వెళ్లాడు. మృదువుగా వున్న కుక్కగొడుగులపై చేతితో నిమిరాడు. అతనికి అనిర్వచనీయమైన ఆనందం కలిగింది. వాటి సృష్టి అందరి దృష్టిలో సర్వసాధారణమయినా, అతని దృష్టికి మాత్రం ఏదో ప్రత్యేకత గోచరించింది.

భగవంతుని సృష్టిలో నిరుపయోగమైనదేదీ లేదనేది అతని నమ్మిక.

అతని మనస్సు కుక్కగొడుగుల మీద నుండి భగవంతుని మీదికి వెళ్లింది. మానవునికి అతి సన్నిహితమైనవాడు, మార్గదర్శకుడు అయినవాడు శ్రీరామచంద్రుడొక్కడే అని అతని విశ్వాసం. అతడే భగవంతుడనే గాఢ నమ్మిక.

''నాన్నా! భోజనం చేద్దాం. రా!'' సూర్యనారాయణ వరండాలో నుండే పిలిచాడు.

కుమారుని పిలుపు సీతారామయ్యను పరాన్నుండి యిహానికి తెచ్చింది.

''వస్తున్నా!'' నంటూ కుమారునితో కలిసి యింట్లోకి వెళ్లాడు.

ఇద్దరు భోజనం చేస్తున్నారు.

''నాన్నా! నా క్లాస్‌మేటు రాజు కూడ మెడికల్‌కు అప్లయి చేస్తున్నాడు. శ్రీకంఠం అప్లికేషన్ తెప్పించాడట కాని అప్లయి చేయడట. నా కిస్తానన్నాడు.'' ఆగి, తండ్రి ముఖంలోనికి సందిగ్ధంగా చూశాడు, నారాయణ.

తనయుని కోరిక తండ్రికి తెలియనిదా? కాని తను ఆ కోరికకు తూగగలడా అన్నదే అతని సంశయం.

సమాధాన మివ్వకుండా భోజనం చేస్తున్నాడు సీతారామయ్య.

తండ్రి మౌనం కొంత నిరాశ కలిగించినా, వూరుకోలేదు నారాయణ. ''నేను ప్యాసయ్యానని శేఖరన్నయ్యకు, శ్రీధరన్నయ్యకు ఉత్తరం వ్రాశావా నాన్నా?'' అన్నాడు.

'అన్నయ్య లిద్దరూ సహాయం చేస్తే తన కోరిక తీరకపోతుందా?' అని నారాయణ ధీమా.

''వ్రాశాను. యింకా ప్రత్యుత్తరం రాలేదు.'' క్లుప్తంగా సమాధాన మిచ్చాడు సీతారామయ్య.

అతనికి తెలుసు - వారి వద్ద నుండి ఎటువంటి సమాధానం వచ్చేది. అందుకే అతని కంతగా ఆశలేదు.

నారాయణ కోల్పోతున్న వుత్సాహాన్ని పుంజుకుంటూ అన్నాడు, ''రాజుకు ఇరవై పర్సంటే మార్కులు వచ్చాయి. ఆ మార్కులకే రావచ్చంటున్నాడు. నాకు ఎనభై పర్సంటు వచ్చాయిగదా? నాకు సీటు రాదంటావా నాన్నా!''

''తప్పక వస్తుంది నాన్నా!''

''అయితే నేను కూడ అప్లయి చేస్తా నాన్నా! అన్నయ్యలకు కూడా ఉత్తరం వ్రాస్తాను.'' ఉత్సాహంగా అన్నాడు నారాయణ.

''సరే. అలాగే చేయి నాన్నా!'' కొడుకును నిరాశ పరచటం తండ్రి కిష్టంలేదు.

ఇద్దరు భోజనం ముగించారు— ఒకరు సందిగ్ధంతోను మరొకరు సంతోషముతోను.

* * *

సీతారామయ్య పడక కుర్చీలో కళ్లు మూసుకొని పడుకొని వున్నాడు. చూచే వారికి నిద్రపోతున్నట్టు కనిపించినా, ముడుతలు పడినసొసట వుబ్బిన నరాలు, ముఖంలో కలిగే మార్పులు మనస్సులోని సంచలనాన్ని, మెదడులోని ఆలోచనలను వ్యక్తపరుస్తున్నాయి. నిజం అంతే! నారాయణ భవిష్యత్తే సీతారామయ్య ఆలోచనలకు నాంది, భరత వాక్యం కూడ.

నారాయణ బయటనుండి వురుకులు, పరుగులమీద వచ్చాడు.

సీతారామయ్య ఆలోచనల నుండి తేరుకొని కళ్లు తెరిచాడు, యింటర్‌వ్యూ కార్డు కూడా రాని కొడుకును ఎలా అనునయించాలా అనుకొంటూ

"...నాకేమో భయంగా వుందినాన్నా! నాకు తన్నంతో రాదో?" దిగులుగా తండ్రి ప్రక్కగా నేలపై కూర్చున్నాడు నారాయణ. కుమారుడి శిరస్సు నిమురుతూ బుజ్జ-

## కుక్క—గొడుగులు

గింపు ధోరణితో అన్నారు: "నీకు తప్పక వస్తుందిలే నాన్నా! నువ్వేమి దిగులు పడకు."

కాని, ఆ దిగులు సీతారామయ్యకు మొదటి నుండీ వుంది— కలిమిలేని వాడి కుండే లక్షణమే అది.





మీరు ఉతికే బట్టలన్నియు మెరిసే తెల్లగాను, పరిశుభ్రంగాను వుంటాయి! సర్ఫ్ యొక్క ఉతికే అధిక శక్తి వల్లనే! ముద్దల కొలదీ నురగ! మీ చీరలు, చొక్కాలు, షర్టులు, పిల్లల బట్టలు ...ప్రతిదీ అమిత తెల్లగాను, అతి శుభ్రంగాను వుంటుంది. సర్ఫ్‌తో ఇంట్లో ఉతుకోండి!

# సర్ఫ్ అమిత తెల్లగా ఉతుకును

'ఎదురు చూస్తుండగనే రెండు రోజులు గడచిపోయాయి. మూడవరోజు శేఖరం, శ్రీధరం వద్దనుండి ఒక్కసారిగా వుత్తరాలు వచ్చాయి.

ఫలితాల కోసం పేపరుమీదికి ఎగబడే విద్యార్థుల లక్షణాలు ఆ క్షణంలో సీతారామయ్యలో కూడా గోచరించాయి. ఆ వుత్తరాలమీదే తన చిన్నకుమారుడి చదువు సాగడం, ఆగిపోవడం జరుగుతుంది. అందుకే అంతటి ఆతృత అతనికుంది.

శేఖరం వ్రాసిన వుత్తరం చదివాడు,

"పూజ్యులైన తండ్రిగారికి నమస్కారములు,

మీరు వ్రాసిన వుత్తరం చేరినది. చిరంజీవి నారాయణ ప్యాసయినాడని తెలిసి సంతోషించినాము. మెడికల్ కాలేజీలో చేర్పించాలని వ్రాశారు. తప్పకుండా చేర్పించండి.

మీకొక శుభవార్త. మీకు త్వరలో మనుమడు పుట్టబోతున్నాడు.

మీ కుమారుడు,

శేఖరం.

సీతారామయ్య ఉత్సాహమంతా నీరుగారి పోయింది. అతని కళ్లలో నీళ్ళు తిరిగాయి.

ఆ వుదుటుకు తట్టుకొని రెండవ ఉత్తరం తీశాడు, చెదరిపోతున్న ఆశలను కూడదీసుకొంటూ.

"పూజనీయులైన తండ్రిగారికి నమస్కారములు,

మీ వుత్తరం అందినది. చి. నారాయణ మెడిసన్ చదివేందుకు డబ్బు పంపమని వ్రాశారు. ప్రస్తుతం నా వద్ద డబ్బు లేదు. నిన్నటిదినమే, మా ఆఫీసర్‌కు వారి అబ్బాయిని మెడికల్ కాలేజీలో చేర్చవలయునంటే అప్పుగా వెయ్యి రూపాయలు యిచ్చినాను. సమయానికి ఆదుకోలేనందుకు క్షమించవలయును. మనకు శక్తి లేనప్పుడు పై ఆశలు పెట్టుకోవడం మంచిది కాదు. మా ఆఫీసులో ఒక గుమాస్తా పోస్టు ఖాళీగా వుంది. మీరు ప్రయత్నించమంటే నారాయణ కోసం మా ఆఫీసరుకు చెప్తాను.

మీ కుమారుడు,

శ్రీధరం.'

ఉత్తరం పూర్తయ్యేసరికి అతని కళ్ల నుండి జల జల నీళ్ళు కారాయి. దుఃఖావేశంతో అతని శరీరం వణికింది. చేతిలో నున్న ఉత్తరం జారిపోయింది.

ఉత్తరం వింటున్న నారాయణ స్తంభించి పోయాడు.

"నాకే వుపదేశాలు చేస్తున్నారు వెధవలు. కృతఘ్నులు." మనస్సులోని వ్యధ మాటల రూపంలో బయట పడింది.

ఈసారి తండ్రి బాధను వుపశమించే బాధ్యత నారాయణమీద పడింది. "ఫరవాలేదులే నాన్నా! రేపు సంవత్సరమే కాలేజీలో చేర్తాను. ఈసారికి వుద్యోగం చేస్తాను."

నారాయణ మాటలకు సీతారామయ్య హృదయం కరిగి పోయింది. "చూస్తాం. నాన్నా! అన్నిటికీ నిర్ణయించేవాడు ఆ దేవుడే." అతని స్వరం గద్గదమయింది.

* * *

"నాన్నా! రాజు సెలక్టు కాలేదట. కార్డు వచ్చిందట." యింట్లోకి వస్తూనే అన్నాడు నారాయణ.

సీతారామయ్య దినపత్రిక చదువుకొంటూ మౌనంగా విన్నాడు. తండ్రి మౌనంగా వుండడం చూచి నారాయణకేమీ తోచలేదు. దినపత్రికలోనిది ఒక పేపరు తీసుకొని చదువుకొంటూ కూర్చున్నాడు నేలమీద.

అర్ధగంట తరువాత పోస్టుమాన్ రిజస్టర్డు కవరిచ్చి వెళ్ళాడు. "నారాయణా! వుత్తరం చదువునాన్నా!" పేపరు మీద నుండి దృష్టి మరల్చకుండానే అన్నాడు సీతారామయ్య.

నారాయణ కవరు చించి, వుత్తరం తీసి చదివాడు.

"పూజ్యులైన గురువుగారికి ప్రణామములు,

శిష్యకోటికి పరమ ఆప్తులయిన మీరు నన్ను మరచిపోయి వుండరనుకుంటాను. తండ్రిలేని నన్ను దరిజేర్చారు. మీ యింటనే అన్నం పెట్టి కన్న కొడుకులా కాపాడి, నాకు విద్యాబుద్ధులు నేర్పారు. ఈనాడు నేను యింతటి వున్నత స్థితిలో, పదవిలో వున్నానంటే మీ ఆదరణ, అభిమానము, ఆశీర్వాద బలమే కారణము. నేనివాడు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాలుగ వుంటున్నాను. మీరు నాకు కనిపించేదైవం. మీ ఆశీర్వాదమే నా కెప్పుడూ కావాలి.

మీ కిప్పుడు యిద్దరు మనుమలున్నారు. చిన్నవాడికి మీపేరే పెట్టుకొన్నాను.

సీటుకోసం నారాయణ అప్లికేషన్ వచ్చింది. అందులో మీ అడ్రస్సు చూచి ఎంతో సంతోషించినాను. నేను మిమ్మల్ని వదలి వెళ్లేటప్పటికి చిన్నగా వుండేవాడు నారాయణ. ఇప్పు ఇంతటి వాడయినందుకు నాకు ఆనందమయింది. ఈ విషయం మీ కోడలికి కూడ తెలిపాను.

నేను మీకు కొడుకులాంటి వాణ్ణి. మీ ఋణం కొంతవరకయినా తీర్చుకోనీయండి. మీరు, నారాయణ యిక్కడికే వచ్చి మాతో వుండవలయునని మా కోరిక. ఇకనుండి నారాయణ చదువు సంగతి నాకు వదిలేయండి. ఆ బాధ్యత నాది. నారాయణ సెలక్టు అయ్యాడు. కాలేజీ జీతం కూడ కట్టినాను.

మీ రిద్దరూ యీ రోజే బయలుదేరి రావలయును

మీకోసం మేమందరం వేచివున్నాం

మీ, సుధాకరం."

ఉత్తరం పూర్తయ్యేసరికి సీతారామయ్యకు ఆనందముతో తన్మయత్వం కలిగింది. దేహం పులకించింది. ఆనందాశ్రువులు రాలాయి. కన్న కొడుకుల వలన కలుగని ఆనందం శిష్యునివలన పొందడం నిజంగా మహాదృష్టం!

"ఈయనెవరు నాన్నా!" సంతోషంతో వుప్పొంగిపోతూ అడిగాడు నారాయణ.

"నీకు నిజమయిన అన్నయ్య!" అంతకన్న మరేమీ చెప్పటానికి సీతారామయ్యకు ఆ సమయంలో తోచలేదు. తోచినా, ఏమి చెప్పినా తక్కువనే అతని భావం.

సాయంకాలం రైలుకు వెళ్ళటానికి ప్రయాణమయ్యారు. నారాయణ తలుపుకు తాళం వేస్తుండగా, సీతారామయ్య కాంపౌండు గోడవద్దకు వచ్చేసరికి కుక్కగొడుగులు కనిపించాయి. వాటిని చూస్తూ నిలబడ్డాడు నారాయణ వచ్చే వరకు.

"అన్నయ్యలకీ విషయం వ్రాద్దామా నాన్నా?" తండ్రి నడిగాడు, నారాయణ.

"ఎందుకులే నాన్నా! కుక్కగొడుగులు." సమాధాన మిచ్చాడు సీతారామయ్య.

ఇద్దరు స్టేషనువైపు బయలుదేరారు.